సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



ముంపు.. ముప్పు!

నాలుగేళ్ల క్రితం కురిసిన వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 30 కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. 8లో▸



న్యాయం చేయండి

పిచికారీ చేసిన గడ్డి మందు వరి పొలంపై పడి పంట ఎర్రబడిందని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు. 8లో▸



మంజూరు చేయించండి

చెరువులు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని ఎంపీ డా.మల్లు రవిని కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. 8లో▸



పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న ఎంపీ మల్లురవి తదితరులు

– షాద్‌నగర్ రూరల్

ఇదేం పరిహారం!

2014లో అప్పటి ప్రభుత్వం శంకర్‌పల్లి మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు 400 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసింది. ఒక్కో టవర్‌కు 350 గజాల భూమి చొప్పున సేకరించింది. రోడ్ ఫేసింగ్ భూమికి రూ.4.50 లక్షలు, కొంత లోపల ఉన్న భూమికి రూ.3.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. ప్రస్తుతం బీదర్ నుంచి మహేశ్వరం వరకు నిర్మిస్తున్న 765 కేవీ సామర్థ్యం ఉన్న ఒక్కో టవర్‌కు 970 నుంచి 1,210 గజాల స్థలం అవసరం. ఈ కారిడార్ నిర్మాణం కూడా 60 మీటర్ల వెడల్పుతో సాగుతోంది. పదేళ్ల క్రితం 400 కేవీ విద్యుత్ టవర్ కోసం సేకరించిన భూమికి నిర్ణయించిన పరిహారాన్నే ప్రస్తుత 765 కేవీ టవర్ నిర్మాణానికి చెల్లిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

765 కేవీ లైన్ ఏర్పాటుకు భూసేకరణ

- రైతుల నెత్తిన ప్రైవేటు సంస్థ కుచ్చుటోపీ
- 2014లో 400 కేవీ లైన్‌కు నిర్ధారించిన నష్టపరిహారమే ప్రస్తుత లైనుకు వర్తింపు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న భూ బాధితులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీదర్ నుంచి మహేశ్వరం వరకు నిర్మించతలపెట్టిన 765 కేవీ విద్యుత్ లైను రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. విద్యుత్ టవర్ల నిర్మాణానికి అవసరమైన అల్యూమినియం, స్టీలు, సిమెంట్, కూలీలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిర్ణయించి.. రైతు పంట పండించే భూమికి మాత్రం పదేళ్ల క్రితం ధరలనే నిర్ణయించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. రైతుల ఆమోదం లేకుండా వారి భూముల్లో టవర్లు నిర్మించడంతో పాటు పరిహారం కూడా తక్కువ చెల్లిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించకపోతే లైన్ల ఏర్పాటు ప్రక్రియను అడ్డుకోవడానికి వెనుకాడబోమని రైతులు, భూ బాధితులు హెచ్చరిస్తున్నారు. కర్నూలు నుంచి వచ్చే లైనుకు జారీ చేసిన ఉత్తర్వులను బీదర్‌లైన్‌కు చూపించి ప్రైవేటు భూముల్లో టవర్లు నిర్మించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

రైతుల ఆమోదం లేకుండానే..

కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఏర్పాటు చేసిన భారీ సోలార్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు



చేవెళ్ల డివిజన్ రేగడిఘనపూర్‌లో టవర్ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

బీదర్ నుంచి మహేశ్వరం మండలం మీర్‌ఖాన్‌పేటలోని 765 కేవీ పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ వరకు 190 కిలోమీటర్ల మేర భారీ టవర్లు, లైన్లు వేయాలని నిర్ణయించింది. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డిజిల్లాల్లోని 20 మండలాలు, 315 గ్రామాల మీదుగా ఈ లైను ఏర్పాటు చేయాలని భావించింది. ఈ మేరకు బీదర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ బహిరంగ ప్రకటన జారీ చేసింది. ఈ లైన్ల నిర్మాణ కాంట్రాక్ట్‌ను ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు భూమిని సేకరించాలంటే ముందుగా రైతులకు నచ్చజెప్పి ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించాలి. ఆ తర్వాతే పనులు మొదలు పెట్టాలి. కానీ సదరు సంస్థ ప్రస్తుత భూముల ధరలు, రైతుల అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పరిహారం నిర్ణయించడమే కాకుండా టవర్లను సైతం ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది. ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో గజం భూమి రూ.వేలల్లో పలుకుతోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ధరలు ఉన్నాయి. మార్కెట్ వాల్యూను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే రీతిన చెల్లింపులు జరుపుతుండటంపై అభ్యంతరాలు వస్తున్నాయి. అంతేకాదు విద్యుత్ టవర్లు, కారిడార్ కింద భవిష్యత్తులో ఎలాంటి వాణిజ్య భవనాలు, గోదాములకు అనుమతి ఇవ్వరు. వరి, పత్తి వంటి సాధారణ పంటలు మినహా ఎత్తయిన పండ్ల తోటలు, టేకు, ఎర్రచందనం సాగుకు అనుమతి ఇవ్వరు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో పరిహారం రాక, భవిష్యత్తులో మార్కెట్ ధరకు అనుగుణంగా ఆయా భూములను అమ్ముకోలేక రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తుతోంది.

ఏకపక్షంగా వ్యవహరించారు



అధికారులు రైతుల పక్షపాతిగా వ్యవహరించాలి. వారికి అన్యాయం జరగకుండా చూడాలి. కానీ నాటి రెవెన్యూ అధికారులు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, రాజకీయ ప్రతినిధుల అభిప్రాయాలతో సంబంధం లేకుండా ఏకపక్షంగా వ్యవహరించారు. ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ఉంటూ రైతులకు తీరని అన్యాయం చేశారు. పదేళ్ల క్రితం నిర్ణయించిన పరిహారానికి ఐదు నుంచి ఆరు రెట్లు అదనంగా పెంచాల్సి ఉంది. అప్పటి కలెక్టర్ మాత్రం 2023 ఆగస్టు 8న ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసి రైతుల నోట్లో మట్టికొట్టారు.

– చింపుల సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్

రైతులకు న్యాయం చేయాలి



రైతుల అంగీకారం లేకుండా వారి భూముల్లో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయడం దారుణం. కర్నూలు నుంచి వచ్చే లైనుకు ఇచ్చిన ఉత్తర్వులను చూపించి, బలవంతపు భూసేకరణకు పాల్పడుతున్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలి. రైతులకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం. ప్రైవేటు సంస్థతో కుమ్మక్కై రైతులకు తీరని అన్యాయం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా రైతులకు న్యాయం చేయాలి. లేదంటే భవిష్యత్తులో భారీ ఆందోళనలు చేపట్టడానికి వెనుకాడబోం.

– ఎం.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నేతలు

కబ్జాపై చర్యలు తీసుకోండి

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ సర్వే నంబర్ 212/1లోని ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక భూమిని కొంతమంది రియల్టర్లు కబ్జా చేశారని సీపీఎం నేతలు ఆరోపించారు. కాపాడాల్సిన మున్సిపల్ కమిషనర్ ప్రైవేటు వ్యక్తులకు పరోక్షంగా సహకరిస్తున్నారని, భూమిని రక్షించడంతో పాటు కబ్జాకు సహకరిస్తున్న సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, జిల్లా సమితి సభ్యుడు పి.శివకుమార్, మున్సిపాలిటీ నాయకుడు కాటంరాజు తదితరులు సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేశారు. సర్వే నంబర్ 212లోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంతమంది కబ్జాదారులు 120 గజాల చొప్పున అక్రమ లే అవుట్ చేయడంతో పాటు పేదలకు సంబంధించిన శ్మశానవాటిక భూమి నుంచి రోడ్డు వేశారని తెలిపారు. దీన్ని అడ్డుకోవాల్సిన మున్సిపల్ కమిషనర్ పరోక్షంగా వారికి సహకరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

హెచ్‌ఎండీఏ అధికారుల్లో ‘హైడ్రా’ గుబులు!

- చెరువులు, కుంటలు, పార్కు స్థలాల్లో నిర్మాణాలు
- అప్పట్లో అడ్డగోలుగా అనుమతులిచ్చిన అధికారులు
- తప్పుడు మ్యాపులు వినియోగించినట్లు ఆరోపణలు
- ఎలాంటి చర్యలు ఉంటాయోనని ఇప్పుడు టెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లే అవుట్లకు గతంలో అడ్డగోలుగా అనుమతులిచ్చిన కొందరు హెచ్‌ఎండీఏ అధికారులను హైడ్రా హడలెత్తిస్తోంది. చెరువులు, కుంటలు, పార్కు స్థలాలను ఆక్రమించుకొని చేపట్టిన భవనాలకు కొందరు అధికారులు నిర్మాణ సంస్థలు, బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తప్పుడు మ్యాపుల ఆధారంగా కొందరు అక్రమాలకు పాల్పడితే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇచ్చిన నిరభ్యంతర పత్రాల ఆధారంగా మరి కొందరు నిర్మాణ అనుమతులను ఇచ్చారు. ఇలా హెచ్‌ఎండీఏ పరిధిలో ఐదారేళ్లుగా వందల కొద్దీ అక్రమ కట్టడాలు వెలిశాయి. చివరకు పార్కు స్థలాలను సైతం వదిలిపెట్టకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని అప్పట్లో పలు సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం అలాంటి నిర్మాణాలన్నింటిపైన హైడ్రా బుల్డోజర్‌ను ఎక్కుపెట్టడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే అక్రమ నిర్మాణానికి అనుమతినిచ్చిన ఓ సహాయ ప్లానింగ్ అధికారిపై చర్యలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇదే బాటలో మరి కొందరు అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాల నెపాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపైన నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగానికి చెందిన ఏపీఓలు, జేపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించిన తరువాత మాత్రమే ఫైళ్లు కదులుతాయి. ఈ క్రమంలో సదరు అధికారులు అన్ని అంశాలను సీరియస్‌గా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ పరిశీలన క్రమంలోనే అక్రమాలకు తెర లేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాత మ్యాపులతో మాయ..

‘చెరువులు, కుంటలు, పార్కులు ఉన్న చోట భవనాలు కట్టే క్రమంలో అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో సదరు స్థలం బఫర్‌జోన్‌లో ఉన్నట్లు తేలితే గూగుల్‌మ్యాపులను దరఖాస్తులతో జత చేస్తున్నారు. కొన్ని చోట్ల మాస్టర్‌ప్లాన్ (2013) కంటే ముందు ఉన్న మ్యాపులను పెట్టేస్తున్నారు’ అని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధి విస్మయం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ మాత్రమే ప్రామాణికమైనదని చెప్పే అధికారులు అందుకు విరుద్ధంగా పాత మ్యాపులతో అనుమతులకు లైన్‌లు క్లియర్ చేయడం గమనార్హం. మరోవైపు కొందరు ప్లానింగ్ అధికారులే బడా నిర్మాణ సంస్థలకు కన్సల్టెంట్లుగా, లైజనింగ్ అధికారులుగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. పటాన్‌చెరు, ఇస్నాపూర్, దుండిగల్, ఘట్కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో లేక్‌వ్యూప్రాజెక్టుల పేరిట వెలిసిన పలు అపార్ట్‌మెంట్‌లకు ఇలాంటి అనుమతులు లభించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో కొన్ని నిర్మాణాలను హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులే స్వయంగా గుర్తించినప్పటికీ రకరకాల ఒత్తిళ్ల కారణంగా ఎలాంటి చర్యలను తీసుకోలేకపోయారు. కొందరు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా మౌనంగా ఉండిపోతే మరి కొందరు నిర్మాణ సంస్థల నుంచే వచ్చే ఆఫర్‌లను దృష్టిలో ఉంచుకొని మౌనం వహించారనే ఆరోపణలు ఉన్నాయి.

అప్పుడు అలా ఇప్పుడు ఇలా..

అప్పుడు ఇష్టారాజ్యంగా అడ్డగోలు అనుమతులు ఇచ్చిన అధికారులు, ఉద్యోగులను ఇప్పుడు హైడ్రా బెంబేలెత్తిస్తోంది. ‘అప్పట్లో అనుమతులు ఇచ్చిన ప్రాంతంలోనే ఇప్పుడు ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ కావాలని అడుగుతున్నారు. మున్సిపాలిటీ అనుమతులపైన భవనాలను నిర్మించిన చోట అదనపు అంతస్తుల కోసం దరఖాస్తు చేసుకొంటే రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతి కావాలని చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం’ అని బాలాపూర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తదితర ప్రాంతాలకు చెందిన భూ యజమానులు కొందరు విస్మయం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా రవీందర్‌గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న రవీందర్‌గౌడ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్‌గా సంగం రవీందర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, తాండూరు ఎమ్మెల్యే, మాజీ చైర్మన్ బి.మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు అంజిరెడ్డి రెడ్డి, చంద్రశేఖర్, బాలిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బూరుకుంట సతీష్, చంద్రశేఖర్, పీజీవీ రాణి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం


షాద్‌నగర్‌రూరల్: ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించాలని తెలిపారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుర్మిద్దలో కొండచిలువ



యాచారం: కుర్మిద్ద గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో సోమవారం కొండచిలువ ప్రత్యక్షమైంది. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న కిషన్‌రెడ్డి పొలంలో ఐదు మీటర్ల కొండ చిలువను రైతులు గుర్తించారు. విషయం తెలుసుకున్న సమీప పొలాల రైతులు అక్కడికి చేరుకున్నారు. కొండచిలువ రైతులపై దాడి చేయడానికి ప్రయత్నించగా కొంతమంది కర్రలతో కొట్టి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న సిద్ధార్థ

షాద్‌నగర్: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షుడిగా షాద్‌నగర్ పరిధిలోని గంట్లవెల్లి గ్రామానికి చెందిన బాదేపల్లి సిద్ధార్థ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సొసైటీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్‌రావు చేతుల మీదుగా సిద్ధార్థ నియామక పత్రం అందుకున్నారు.

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు వచినట్టు జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు ఫిర్యాదులు చేశారని, వాటిని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు చెప్పారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మహిళా రైతుకు లీగల్ నోటీస్

బ్యాంకులో తీసుకున్న లోన్ చెల్లించాలని సారాంశం

కేశంపేట: బ్యాంక్‌లో తీసుకున్న రుణం చెల్లించాలంటూ ఓ మహిళా రైతుకు లీగల్ నోటీసు అందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తలసాని యశోదమ్మ గ్రామంలోని కెనరా బ్యాంకులో లోన్ తీసుకున్నారు. 2001లో రూ.68 వేల లోన్ తీసుకోగా.. ఇందులో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించారు. రూ.48,129 లోన్ డబ్బులు చెల్లించాలంటూ సోమవారం బ్యాంకు ద్వారా లీగల్ నోటీసు పంపించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో యశోదమ్మ పేరు ఉన్నప్పటికీ.. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఆన్‌లైన్‌లో పెండింగ్ అని చూపిస్తోంది. దీంతో ఇందుకు అవసరమైన పత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించారు. రైతు పేరున రేషన్ కార్డు లేకపోవడంతో ఫ్యామిలీ గ్రూపింగ్ లేక రుణమాఫీ కాలేదని వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిల్‌రెడ్డి తెలిపారు. రైతు భర్త గతంలో మరణించాడని, అతడికి ఆధార్ కార్డు లేకపోవడంతో ‘సింగిల్ పర్సన్’ గుర్తింపు రుణమాఫీకి ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. రైతుకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని, నిర్ధారణ తర్వాత రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు.



బ్యాంక్ నుంచి వచ్చిన నోటీసును చూపిస్తున్న యశోదమ్మ

నిమజ్జనాల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ వద్ద మంగళవారం నుంచి గణేశ్ విగ్రహాల నిమజ్జనం హడావుడి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆ చుట్టపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నుంచి ఈనెల 16 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి అర్ధరాత్రి వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. నిమజ్జనాల నేపథ్యంలో సెయిలింగ్ క్లబ్ టీ జంక్షన్, వీవీ స్టాట్యూ, తెలుగుతల్లి జంక్షన్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ చౌరస్తా, నల్లగుట్ట ప్రాంతాల నుంచి వాహనాల మళ్లింపు ఉండనుంది. ట్రాఫిక్ స్థితిగతులు, నిమజ్జనం రద్దీ ఆధారంగా మళ్లింపులు, ఆంక్షలు అమలు చేస్తామని ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి సహకారం అవసరమైనా 9010203626 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



నిమజ్జన సందడి షురూ..



గణనాథుడి నిమజ్జన సందడి షురూ అయింది. మూడో రోజు కావడంతో సోమవారం నగరవ్యాప్తంగా పలుచోట్ల వినాయకుడి ప్రతిమలను ఆయా కొలనులు, చెరువుల్లో భక్తులు నిమజ్జనం చేశారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్, సరూర్‌నగర్ చెరువుకట్ట, ఉప్పల్ నల్ల చెరువు, ఇతర ప్రాంతాల్లోని చెరువులు, జీహెచ్‌ఎంసీ కొలనుల వద్ద కోలాహలం కన్పించింది. బ్యాండ్ మేళాలు, నృత్యాలు, డీజేలతో తరలివచ్చి భక్తులు నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా నిమజ్జన సందడి కొనసాగింది.

– సాక్షి, సిటీబ్యూరో

‘రింగ్’ మార్కింగ్‌తో కలవరం

- ఆయా గ్రామాల్లో వెలసిన గుర్తులు
- సోషల్ మీడియాలో సర్వేలు, మ్యాప్‌ల పేరుతో చక్కర్లు
- చేవెళ్ల నియోజకవర్గంలో చర్చనీయాంశం
- తమ భూములు పోతాయేమోనని రైతుల ఆందోళన



చేవెళ్ల మండలం అంతారం, హస్తేపూర్, నవాబుపేట మండలం పూలపల్లి సమీపంలో వేసిన మార్కింగ్

చేవెళ్ల: ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) కోసం వేసిన సర్వే మార్కింగ్‌లు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కలవరానికి గురి చేస్తున్నాయి. ఇటీవల వేసిన గుర్తులను చూసిన ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తమ భూములు పోతాయేమోనని ఆందోళనకు గురవుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని షాబాద్, చేవెళ్ల, నవాబుపేట మండలాలకు సంబంధించిన పలు గ్రామాల్లో మార్కింగ్ వేశారు. అధికారికంగా ఈ రోడ్డు ఎక్కడి నుంచి వెళ్తుంది అనేది ప్రకటించకపోయినప్పటికీ వేసిన గుర్తులతో చర్చలు మొదలయ్యాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో జరిగిన సర్వేల ప్రకారం ఈ ప్రాంతం నుంచి రోడ్డు వెళ్తుందనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇన్నాళ్లు అటుఇటుగా రోడ్డు వస్తుందనే ఆలోచనలో ఉండగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగం రోడ్డు మార్కింగ్ రోడ్డు పనులను తామే చేస్తామని చెప్పడం.. ఈ రోడ్డులో మార్పులు సైతం ఉంటాయని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సర్వేకోసమని ఆయా గ్రామాల్లో మార్కింగ్ వేశారు. దీంతో రోడ్డు తమ గ్రామాల మీదుగానే పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ గ్రామాల మీదుగా గుర్తులు

షాబాద్ మండలంలోని షాబాద్, ముట్పూర్, చిలకమర్రి, రేగడి దోసాడ, ఎట్ల ఎర్రవల్లి, చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్, ఖానాపూర్, బస్తేపూర్, కిష్టాపూర్, నాంచేరి, అంతారం, హస్తేపూర్, కొకుంట్ల, నవాబుపేట మండలంలోని పూలపల్లి, గంగ్యాడ, పత్తేపూర్, ఎల్లకొండ తదితర గ్రామాల మీదుగా మార్కింగ్ చేసిన గుర్తులు ఉండటంతో ఈరోడ్డు ఇలాగే వెళ్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎస్‌- 166, ఎస్‌- 167, ఎస్‌- 168, ఎస్‌- 169, ఎంసీపీ -10 అంటూ తెలుపు, నలుపు రంగులతో గుర్తులు వేశారు.

సమాచారం లేదంటున్న స్థానిక అధికారులు

ఇప్పటికే ఈరోడ్డుకు సంబంధించిన మ్యాపులు, సర్వేలు అంటూ అనేకం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ రోడ్డు సర్వే ఫైనల్ మ్యాపులు, సర్వే నంబర్లు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. అప్పటి వరకు వేచి చూడాల్సిందే. కానీ ఈ మార్కింగ్‌లతో సర్వే జరుగుతుందని ప్రజల్లో ఆందోళన మొదలైంది. దీనిపై స్థానిక రెవెన్యూ, సర్వే అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మార్కింగ్ విషయం కూడా తెలియదని సమాధానం ఇస్తున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుపై స్పష్టత ఇవ్వాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో
ప్రాణమిత్రుల దుర్మరణం


కరుణాకర్ (ఫైల్)


శేఖర్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ప్రాణ స్నేహితులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. ఈ విషాద సంఘటన మండలంలోని ఎలికట్ట శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ కుమార్ కథనం ప్రకారం.. కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రికి చెందిన కరుణాకర్(20), పులుసుమామిడికి చెందిన రెడ్డి శేఖర్(26) ప్రాణస్నేహితులు. కరుణాకర్ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తుండగా, శేఖర్ ఆర్టీసీ ప్రైవేట్ బస్సు నడుపుతున్నాడు. వీరు ఎక్కడికి వెళ్లినా కలిసి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు షాద్‌నగర్‌లో కలుసుకున్నారు. రాత్రి 10 దాటడంతో కరుణాకర్ తన బంధువుకు చెందిన బైక్ తీసుకుని ఇద్దరూ ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యలో మద్యం తాగారు. ఈ క్రమంలోనే ఎలికట్ట చౌరస్తా సమీపంలో రోడ్డుపై పార్కు చేసిన ఓ లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కరుణాకర్, శేఖర్‌లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

ఇరు కుటుంబాల్లో విషాదం

విషయం తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కరుణాకర్ తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాంచందర్ తెలిపారు. చేతికొచ్చిన తమ కొడుకులు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెల విసేలా రోదించారు. ఒక్కగానొక్క కొడుకును ప్రమాదం బలి తీసుకుందని కరుణాకర్ తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. బాధితులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకొని ఓదార్చారు.

జనాభా ప్రకారం నిధులు కేటాయించాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర
మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి


సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల
మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: 16వ ఆర్థిక సంఘం నిధులు ప్రస్తుత జనాభా ప్రకారం ఇవ్వాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనాగరియా అధ్యక్షతన తెలంగాణ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రాంచంద్రన్, ఫైనాన్స్ కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 16వ ఆర్థిక సంఘంలో చేర్చాల్సిన సూచనలు, సలహాలు అడిగారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు 85శాతం, మండల పరిషత్‌లకు పదిశాతం, జిల్లా పరిషత్‌లకు ఐదు శాతం నిధుల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలను వ్యవసాయ రంగానికి అనుసంధానించాలని కోరానన్నారు. 2024–25 జనాభాను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించాలన్నామన్నారు. సర్పంచ్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మొయినాబాద్: అర్ధరాత్రి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల టౌన్‌కు చెందిన భానుప్రకాశ్(19), నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కాశిరెడ్డి గణేశ్‌రెడ్డి మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఉన్న విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ స్థానిక హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు ఆదివారం అర్ధరాత్రి కాళిమందిర్ వద్ద భోజనం చేయడానికి బైక్‌పై బయలుదేరారు. అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలోని మజీద్ వద్ద మలుపు తిరుగుతుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న భానుప్రకాశ్‌తోపాటు గణేశ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్సకోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భానుప్రకాశ్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం

కడ్తాల్: మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన బీచ్యానాయక్ పాడి ఆవు సోమవారం పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి భానునాయక్ గ్రామానికి చేరుకుని మృతి చెందిన ఆవును పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పొలాల వద్ద ఆవుల భద్రతకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

ముంపు.. ముప్పు!

- తుర్కయంజాల్ మున్సిపాలిటీలో అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలు
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం


రాగన్నగూడలో ఇళ్ల మధ్యలో నిలిచిన వరదనీరు (ఫైల్)

తుర్కయంజాల్: నాలుగేళ్ల క్రితం కురిసిన సుమారు 12 సెంటీ మీటర్ల వర్షపాతానికే మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 30 కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. అప్పట్లో కురిసిన వానకు తుర్కయంజాల్ మాసబ్ చెరువు, రాగన్నగూడలోని కొత్త చెరువు, ఎర్రకుంట, గంగరాయి చెరువు, ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు, తొర్రూర్, కొహెడ, బ్రాహ్మణపల్లిలోని పలు చెరువులు నిండి అలుగులు పారి, ఇళ్లను ముంచెత్తాయి. గత అనుభవాల నుంచి పాలకులు, అధికారులు పాఠాలు నేర్చుకొని చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు అనివార్యం అవుతున్నాయి.

మాసబ్ చెరువు అలుగు కబ్జా

మాసబ్ చెరువు అలుగును పూర్తిగా పూడ్చి వేసి కేవలం ఆరు ఫీట్ల వెడల్పుతో కాలువను నిర్మించి, దానిపైన సీసీ రోడ్డును వేశారు. దీనిపై 2016 సెప్టెంబర్‌లో చెరువులు, కుంటలు, కాలువలు కబ్జా అని 'సాక్షి' పూర్తి వివరాలతో కథనం ప్రచురించినా అధికారులు పట్టించుకోలేదు. ఐదేళ్లు నుంచి చెరువు ఏటా నిండి అలుగు పారుతుండటంతో స్థానిక వెంచర్‌లో నివసించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. రెండు అపార్ట్‌మెంట్‌లతో పాటు పలు నిర్మాణాలు నీట మునుగుతున్నాయి. ఇంజాపూర్‌లోని ఇందిరమ్మకాలనీ ముంపునకు గురవుతుంది. హయత్‌నగర్‌లోని బాతుల చెరువుకు నీరు వెళ్లే కాలువను ఇంజాపూర్‌లో కబ్జా చేసి గోదాములు నిర్మించినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇవే కాకుండా పలు కాలనీలు నీట మునుతుండటంతో అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.


మాసబ్ చెరువు అలుగు కబ్జా చేసిన
ప్రాంతంలో ప్రవహిస్తున్న వాగు

స్వచ్ఛందంగా తొలగించండి



చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైడ్రాతో ఆక్రమణలు తొలగిస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా చర్యలు ఉంటాయి.

– మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి,
చైర్ పర్సన్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

నివేదిక సమర్పిస్తాం

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే కాలువలు, నాలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించే పనిలో ఉన్నాం. వీటిపై త్వరలోనే నివేదిక సమర్పిస్తాం. వర్షాలు అధికంగా కురిస్తే నీరు సులువుగా ప్రవహించేలా కాలువలు, నాలాలపై ఆక్రమణలను తొలగిస్తాం. మాసబ్ చెరువు అలుగును ఇప్పటికే పరిశీలించాం.

– తాహ్సీన్ రజా, ఇరిగేషన్ ఏఈ

రియల్ మాఫియా ఆగడాలు

మన్నెగూడలోని ఎర్ర కుంట చెరువును కబ్జా చేసి ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కాలనీ ఏటా వర్షం నీటిలో మునుగుతుంది. అదేవిధంగా రాగన్నగూడలోని గణేశ్‌నగర్, జీవీఆర్ కాలనీ, దుర్గాంజనాద్రి కాలనీల్లో వర్షం నీరు పోవటానికి వీలు లేకుండా కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. సూరజ్‌నగర్, సాయి బృందావనం కాలనీల్లో నీరు ప్రవహించే కాలువ కుంచించుకుపోవడంతో ముంపు బారిన పడుతున్నాయి. తుర్కయంజాల్‌లోని ఆదిత్యానగర్ కాలనీ అధిక శాతం మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుంది. ఈ కాలనీలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. బ్రాహ్మణపల్లిలో చెరువు అలుగును వదలకుండా మరో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. చెరువు అలుగు పారితే అనేక ఇళ్లు నీట మునుగుతున్నాయి. ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు లేవు.

నష్టపోయా.. న్యాయం చేయండి

చేవెళ్ల: గ్రామ పంచాయతీ సిబ్బంది పిచికారీ చేసిన గడ్డి మందుతో నష్టపోయిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లగూడకు చెందిన రైతు శ్రీశైలంకు చెందిన పొలం రోడ్డు పక్కనే ఉంది. ఇటీవల గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్ల వెంబడి ఉన్న గడ్డిని తొలగించడానికి రసాయన మందును పిచికారీ చేశారు. దీంతో తన వరి పంటపై మందు పడి నాశనం అయిందని రైతు వాపోయాడు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ హిమబిందుకు ఆదుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. ఇటీవల గ్రామ కార్యదర్శి మురళీకృష్ణ ట్రాక్టర్ ద్వారా గడ్డి మందును సిబ్బందితో పిచికారీ చేయించాడన్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న గడ్డిపై మందు పిచికారీ చేయటంతో పక్కనే ఉన్న వరి పంట పొలంపై పడిందన్నారు. రెండురోజుల తర్వాత వరి పంట ఎర్రగా మారుతుండటంతో రైతు గమనించి గడ్డి మందు పడినట్లుగా గుర్తించారు. మందు పిచికారీ చేసిన ఫొటోలు గ్రామానికి సంబంధించిన గ్రూప్‌లో పోస్ట్ చేయటంతో వాటిని పరిశీలించారు. దీంతో రైతు ఈ విషయంపై గ్రామ కార్యదర్శి మురళీకృష్ణను, ప్రత్యేకాధికారి దేవేందర్ రెడ్డిలను ఫోన్‌లో సంప్రదిస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయాడు. దీనిపై ప్రశ్నించి ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించటంతో గ్రామంలోనే మరో ఇద్దరు రైతుల పంట పొలాలపై విరుగుడు మందును పిచికారీ చేయించినట్లు చెప్పారు. ఈ విషయంపై ఎంపీడీఓ స్పందించి గ్రామాన్ని పరిశీలించి ప్రత్యేకాధికారి, కార్యదర్శితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.


ఎంపీడీఓ హిమబిందుకు ఫిర్యాదు చేస్తున్న
గ్రామస్తులు, బాధిత రైతు శ్రీశైలం

జల్‌పల్లి చెరువుకు నిమజ్జన శోభ

పరిశీలించిన డీసీపీ సునీతారెడ్డి


మున్సిపల్ సిబ్బందితో
మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి చెరువుకు నిమజ్జన శోభ సంతరించుకుంది. ఉత్సవాలలో భాగంగా 3వ రోజు నుంచి 9వ రోజు వరకు ఇక్కడ గణనాథులను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇందుకు సంబంధించి మున్సిపాలిటీ తరఫున రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. మూడో రోజే కావడంతో ఒక క్రేన్‌ను ఏర్పాటు చేసిన అధికారులు.. ఐదో రోజు నుంచి మరో క్రేన్‌ను అందుబాటులోకి తేనున్నారు. ముత్యాలమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుద్దీపాల అలంకరణ, నిమజ్జన ప్రదేశంలో కంకర, మార్గం మధ్యలో గోతులను మట్టితో నింపడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కాగా నిమజ్జన ఏర్పాట్ల విషయమై సోమవారం మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్సై శ్రీనులు పరిశీలించారు.

నిధులు మంజూరు చేయించండి

ఎంపీ మల్లురవిని కోరిన కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు: భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేయించాలని ఎంపీ డా.మల్లురవిని ఆమనగల్లు, కడ్తాల మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మల్లురవిని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవికి పుష్పగుచ్ఛం అందించి వివిధ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కడ్తాల మండల కేంద్రంలో ప్రభుత్వాస్పత్రి, 108 అంబులెన్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్‌లను ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అభ్యర్థించారు.


మల్లురవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

సందేశాత్మకంగా 'దిక్సూచి'

మైక్రో ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరించిన
చంచల్‌గూడ ఎస్పీ శివకుమార్

సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలే ప్రధాన అంశంగా తెరకెక్కుతున్న మైక్రో ఫిల్మ్ 'దిక్సూచి' పోస్టర్‌ను చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్ ఆవిష్కరిచారు. కార్యక్రమంలో పాల్గొన్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ., మహిళల పైన అఘాయిత్యాలు చేసే వారి మైండ్ సెట్ మారాలని, ఆడవారిని గౌరవించడం పాఠశాల దశనుండే అలవర్చాలన్నారు. ఒక మహిళా వైద్యురాలికి జరిగిన అఘాయిత్యంపై లఘు చిత్రం నిర్మించడం ద్వారా సమాజానికి మంచి మెసేజ్ ఇస్తున్నారన్నారు. సందేశాత్మక చిత్రానికి దర్శకత్వం వహించడం సంతోషంగా ఉందని చిత్ర దర్శకులు శివ నాగరాజ్ అన్నారు. నెలాఖరులోగా ఈ లఘు చిత్రం ప్రేక్షకులకు అందుబాటులోకి వస్తుందని నిర్మాత కొమటి రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈ చిత్రంలో మ, యూట్యూబ్ నటులు ఆర్యన్ వర్మ, దినేష్, క్రేజీ బాయ్స్ సాయి నటించగా కేతన్, నవీన్ కుమార్, మణికంఠ, హర్ష భరద్వాజ్ జాఫర్, వంశీ కృష్ణ సాంకేతిక సహకారం అందించారు.

ఓపీఎస్ సాధనకు అవిశ్రాంత పోరు


లేమూరులో సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కందుకూరు: ఓపీఎస్ పునరుద్ధరణ అయ్యేంత వరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు డాక్టర్ జగన్నాథ్‌శర్మ, కల్పన పేర్కొన్నారు. సోమవారం కందుకూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలు వెంటనే విడుదల చేయాలని, హెల్త్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయుల జులై నెల జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డాక్టర్ కల్లేష్, ప్రధానకార్యదర్శి డాక్టర్ బుగ్గరాములు, కార్యదర్శి నజీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


నరేశ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన బత్తుల నరేశ్(33) ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన సోమవారం ఉప్పరిగూడ గ్రామ పరిధిలోని ఏవీసీ వెంచర్‌లో మామిడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్మకు పాల్పడ్డారు. నరేశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య మాధవి, రెండున్నరేళ్ల కుమారుడున్నట్లు తెలిపారు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

మద్యం దుకాణంలో మంటలు


కాలిపోయిన మద్యం దుకాణం

తుర్కయంజాల్: వినాయకుడి ముందు పెట్టిన దీపంతో మద్యం దుకాణం పాక్షికంగా దగ్ధం అయిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమ్మగూడలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మగూడలోని ఎస్ఆర్‌వై వైన్స్‌లో వినాయక చవితి రోజు ఏర్పాటు చేసిన గణనాథుడిని ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి దీపం వెలిగించి దుకాణం మూసివేశారు. ఉదయం వైన్స్‌లో నుంచి మంటలు వస్తుండటాన్ని పక్కనే ఉండే టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు గమనించి యజమానికి సమాచారం ఇచ్చాడు. దీంతో షటర్ తెరిచి చూడగా దుకాణంలో కొంత భాగం కాలిపోయింది. సరైన సమయంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. కొన్ని మద్యం సీసాలు దగ్ధం అయ్యాయి. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.

కారు ఢీకొని.. వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

పహాడీషరీఫ్: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకొని ఇంటికి వస్తున్న నవ దంపతుల ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో భర్త మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ రంగనాయకుల కాలనీకి చెందిన రాములు కుమారుడు డి.శంకర్(22) ఆరు నెలల క్రితం వస్లావత్ అనితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వినాయక ఉత్సవాలలో భాగంగా భార్యాభర్తలిద్దరూ ఆదివారం రాత్రి యాక్టివాపై బాలాపూర్ గణనాథుడిని దర్శించుకొని తిరుగు పయనమయ్యారు. ఏరోసిటీ సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న ఓ కారు ముందున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తుండగా డ్రైవర్ శంకర్ యాక్టివాతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్యకు కాలు విరిగింది. మరో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్.. ఒకరిపై కేసు

ఇబ్రహీంపట్నం: అక్రమంగా వంట గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్న ఓ షాపుపై దాడి చేసి, వ్యక్తిని అదుపులోని తీసుకున్న సంఘటన సోమవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మంచాల రోడ్డులో గల రాఘవేంద్ర ఎలక్ట్రానిక్ షాపులో అక్రమంగా మెస్టిక్ సిలిండర్లను తీసుకొచ్చి, చిన్న సిలిండర్‌లో రీఫిల్లింగ్(నింపడం) చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు షాపుపై దాడి నిర్వహించి మహేందర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. షాపులోని ఫిల్లింగ్ సామగ్రి, మూడు పెద్ద, ఆరు చిన్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మందల్లోంచి జీవాల అపహరణ

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మందల నుంచి రూ.లక్షకు పైగా విలువ చేసే గొర్రెలు, మేకలను ఆదివారం రాత్రి అపహరించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది శ్రీశైలంకు చెందిన రెండు గొర్రెలు, గుండ్ల రాములుకు చెందిన మేకపోతు, కాకులారం యాదయ్యకు చెందిన గొర్రె, నాలుగు మేకలను వారి మందల్లోంచి ఎత్తుకెళ్లారు. మొత్తంగా ఎనిమిది జీవాలు అపహరించినట్లు రైతుల ఫిర్యాదు మేరకు సోమవారం యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్.. అడ్వకేట్‌కు రిమాండ్

శంషాబాద్ రూరల్: పట్టా భూమిని రెండోసారి రిజిస్ట్రేషన్ చేసిన అడ్వకేట్ కటకటాల్లోకి వెళ్లాడు. గతంలో కూడా ఇతనిపై భూతగాదా కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దషాపూర్ వాసి జిల్లా రమేష్ నగరంలోని సరూర్‌నగర్ ఉంటూ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇతనికి స్వగ్రామంలో సర్వే నంబరు 173/ఊ/1లో ఒక ఎకరా 14 గంటల భూమి ఉంది. ఈ భూమిని 2017లో ఓ వ్యక్తికి అమ్మి అతనికి స్వాధీనం చేశాడు. సదరు కొనుగోలు దారుడు ఈ భూమి మ్యూటేషన్ కోసం రెవెన్యూ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోగా పెండింగ్ ఉన్నట్లు కనపడింది. ఈ క్రమంలో ధరణిలో ఈ భూమి రికార్డు రమేష్ పేరుపై నమోదై ఉంది. ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న రమేష్ తన పేరుతో పట్టా పాసు పుస్తకం తీసుకున్నాడు. అనంతరం భూమిని మరో వ్యక్తికి అమ్మేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై గతంలో కూడా భూతగాదా కేసులు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎవరైనా భూలావాదేవీలు, ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలను సరి చూసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.